క్లుప్తంగా

కిలో వెండి దిమ్మె విరాళం



నగరంపాలెం: గుంటూరు కొత్తపేటలోని ఆంజనేయస్వామి ఆలయానికి నగరానికి చెందిన ఓ భక్తుడు కిలో వెండి దిమ్మె అందజేశారు. బ్రాడీపేటకు చెందిన జీవీహెచ్ కుమారదత్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కొత్తపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలోని స్వామికి కానుక నిమిత్తం కిలో వెండి దిమ్మెను శనివారం లాలాపేటలోని వెంకటేశ్వరస్వామి దేవస్థాన కార్యాలయంలో సహాయ కమిషనర్(ఏసీ) దీవి శ్రీనివాసరావుకు అందజేశారు. అనంతరం కుమారదత్త దంపతులకు స్వామి వారి దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలు అందించారు.

పేదలకు అన్నదానం



గుంటూరు మెడికల్: పేదలకు కడుపు నిండా భోజనం పెట్టేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. శ్రీ బలరామ హరేకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జీజీహెచ్ ఎదుట పేదలకు అన్నదానం నిర్వహించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎంతోమంది అన్నదాతలు భోజనం పెట్టేందుకు ముందుకు వస్తున్న వారందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శరణం దుర్గా ప్రసాద్, నేరెళ్ల మాధవరావు, ఇంకొల్లు సత్యనారాయణ, బిజీనేపల్లి రాము పాల్గొన్నారు.

నేడు లైన్స్ డిస్ట్రిక్ట్ 316-హెచ్ ప్రమాణ స్వీకారోత్సవం

నగరంపాలెం: శ్రీ వెంకటేశ్వరస్వామి విజ్ఞాన మందిరంలో లైన్స్ డిస్ట్రిక్ట్ 316- హెచ్ ఏడో ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా గవర్నర్ (316-హెచ్) పరుచూరి గోపీచంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు చేయూత అందించేందుకు వంద కుట్టు మిషన్లు, 50 గ్రైండర్లు, 20 ఇస్త్రీ పెట్టెలు, 50 తాపీ సామన్లను అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నా రు. ఈ బృహత్ కార్యక్రమానికి నిర్వాహకులుగా లైన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు(పట్టాభిపురం) శ్రీకారం చుట్టారని అన్నారు. ముఖ్యఅతిథిగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరవుతారని చెప్పారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

గుంటూరు మెడికల్: స్థానిక జీజీహెచ్‌లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం పలు ఓపీలను ఆయన పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరిశీలించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రోగులకు ఇబ్బందులు లేకుండా ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఎస్ఆర్, సర్వీస్ పీజీలు వైద్య కళాశాల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. వీరంతా అత్యవసర వైద్య సేవల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. ఓపీకి సుమారు 1700 మంది రోగులు వచ్చారని అత్యవసర విభాగానికి వచ్చిన వంద మందిని అడ్మిషన్లు ఇచ్చామని తెలిపారు. ఓపీలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండాలని సూచించారు.

ఆకట్టుకున్న మృదంగ లయ విన్యాసం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై శ్రీమహా దేవు రాధాకృష్ణరాజు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల సంయుక్తంగా మృదంగ సద్గురువుల సంస్మరణోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రశిష్య బృందం కె.భార్గవ్, ఎం.కృష్ణసాయి, సిహెచ్.సూర్య, కె.సుబ్రహ్మణ్యం, వరుణ్ రవిచంద్రన్, బి.కె.సాయిచరణ్, కె.అక్షయ్‌పాల్ మృదంగ లయ విన్యాసాన్ని ప్రదర్శించారు. అనంతరం శాస్త్రీయ సంగీత విభావరిలో ఎన్.సిహెచ్.కౌశిక్ కళ్యాణ్ గాత్రధారణతో వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. వయోలిన్‌పై ఎం.శ్రీరమ్య, మృదంగంపై బి.సురేష్‌బాబు, ఘటంపై ఎస్.ఎ.ఫణిభూషణ్ చక్కటి వాయిద్యాన్ని అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.గోవిందరాజన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

శిలాఫలకాల ధ్వంసంపై కౌన్సిల్‌లో రగడ

- అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ధ్వంసం: వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల ధ్వజం
- వేస్ట్ టౌన్ ప్లానింగ్ అంటూ అధికారులపై నోరు పారేసుకున్న ఎమ్మెల్యే నసీర్
- గోరంట్ల తాగునీటి పథకంపై సుదీర్ఘ చర్చ
- కౌన్సిల్ మధ్యలో టీడీపీ ఎమ్మెల్యేలకు సన్మానం
- పార్టీలకు అతీతంగా నగరంలో అభివృద్ధి పనులు: మేయర్ కావటి



మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్‌నాయుడు

నెహ్రూనగర్: కార్పొరేషన్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక శిలాఫలకాలు ధ్వంసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మల్లవరపు రమ్య, అచ్చాల వెంకటరెడ్డి, దూపాటి వంశీ, రామనబోయిన అజయ్, షేక్ రోషన్, ఈచంపాటి వెంకటకృష్ణ మండిపడ్డారు. కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. 54వ డివిజన్ ఎస్సీ వార్డులో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తొలగించడంపై కౌన్సిల్‌లో రచ్చ రచ్చగా మారింది. ఎమ్మెల్యే, దళిత వార్డులో ఏ విధంగా శిలఫలాకాన్ని ధ్వంసం చేస్తారంటూ కౌన్సిలర్ రమ్య ప్రశ్నించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోనూ శిలాఫలకాలను ధ్వంసం చేశారని దీనికి ఎటువంటి చర్యలు తీసుకుంటారో అధికారులు స్పష్టం చేయాలని కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్ పట్టుబట్టారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ డీఆర్వో ఆదేశాల మేరకు నగరంలో శిలాఫలకాలు ఏర్పాటు చేసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి చర్యలకు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

టౌన్ ప్లానింగ్ అధికారులపై..

నగరంలో శిలఫలాకాలు ఏర్పాటు చేస్తున్న విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా, బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్నారని, వేస్ట్ టౌన్ ప్లానింగ్ అధికారులు అంటూ అధికారులపై ఎమ్మెల్యే నసీర్ జిరుబుర్రులాడారు. నగరంలో 9.50 లక్షల జనాభా అనబోయి... 95 లక్షల జనాభాకు సరిపడా వాటర్ సప్లయికి ప్రత్యేక ఏఈని నియమించాలని నోరుజారారు.

ఎమ్మెల్యేలకు సన్మానం

కౌన్సిల్ జరుగుతున్న సమయంలో టీడీపీ కార్పొరేటర్లు మా ఎమ్మెల్యేలను సన్మానించుకోవాలని హడావుడి చేసి కౌన్సిల్‌ను ఆపివేసి మరి టీడీపీ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, రామాంజనేయులను సన్మానించుకున్నారు. కౌన్సిల్ హాల్‌లో సభ్యులు కూర్చునే స్థానాల్లో టీడీపీ కార్యకర్తలు కూర్చొని మరి టీడీపీ ఎమ్మెల్యే మాట్లాడుతున్న ప్రతి సారి బెంచిలను కొడుతూ హల్‌చల్ చేశారు. టీడీపీ కార్పొరేటర్లు యల్లావుల అశోక్, సమత, భారతి అయితే ఏకంగా ప్రభుత్వం మారింది.. ఇప్పటి దాకా మేము సైలెంట్‌గా ఉన్నాం. ఇక నుంచి సైలెంట్‌గా ఉండేది లేదు.. మీరు కూర్చోవాలంటూ వైఎస్సార్ సీపీ సభ్యులను హెచ్చరించారు. దానికి వైఎస్సార్‌సీపీ సభ్యులు ఘాటుగా సమాధానం ఇచ్చారు.



శిలాఫలకం ధ్వంసంపై చిత్రాలను ప్రదర్శిస్తున్న కార్పొరేటర్లు

పార్టీలకు అతీతంగా నగరాభివృద్ధి – మేయర్ కావటి మనోహర్ నాయుడు

గుంటూరు నగరంలో పార్టీలకు, కులాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పాలక వర్గం వచ్చాకే నగరంలో ఎన్నడూ లేని విధంగా సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణం చేపట్టామన్నారు. గుంటూరు నగరంలో ఆర్‌యూబీ నిర్మాణాలకు రైల్వే శాఖ డ్రైనేజీ సమస్య వలన అనుమతి ఇవ్వడం లేదని... కేవలం ఆర్వోబీలకు మాత్రమే అనుమతి ఇచ్చిందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు.

ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం..

55వ డివిజన్‌లో కార్మిక శాఖకు సంబంధించిన ప్రభుత్వ స్థలాన్ని అక్రమించి బిల్డింగ్ నిర్మాణం చేస్తున్నారని టౌన్ ప్లానింగ్ అధికారులు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా కనీసం అధికారులు స్పందించలేదని కార్పొరేటర్లు పాపతోటి అంబేడ్కర్, దూపాటి వంశీ వాపోయారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఎక్కడ కూడా అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణం చేయకూడదని... ఎక్కడైన అలా జరిగితే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు.

తిరిగి ఆదివారం కౌన్సిల్..

శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన కౌన్సిల్ సమావేశం సుదీర్ఘంగా సాగింది. శనివారం రాత్రికి సభ్యుల 77 ప్రశ్నలకు గాను 50 ప్రశ్నలు మాత్రమే పూర్తి కావడంతో మిగిలిన ప్రశ్నలు, సభ్యుల ప్రతిపాదనలు 150, ప్రియాంబుల్స్ 11 ఆమోదం కోసం మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించాలని తీర్మానం చేశారు.

గోరంట్ల తాగునీటి పథకాన్ని ఎంతకాలం సాగదీస్తారు..



గోరంట్ల తాగునీటి పథకం ఎన్ని సంవత్సరాలు సాగదీస్తారు... విలీన గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించడంలో నగరపాలక సంస్థ వైఫల్యం చెందుతుందంటూ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు ఇంజినీరింగ్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిధుల కొరత కారణంగా కాంట్రాక్టర్ పనులు ఆపివేయడం ఏంటంటూ అధికారులను నిలదీశారు. అవసరమైతే రూ.మూడు కోట్ల అయిన ఖర్చు చేసి గోరంట్ల తాగునీటి పథకాన్ని పూర్తి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, అధికారులకు సూచించారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ కాంట్రాక్టర్‌ను వారం రోజుల్లో పిలిపించి సమస్యకు పరిష్కారం చూపాలని సూపరింటెండెంట్ ఇంజినీర్‌కు సూచించారు.

తగిన సూచనలు ఇవ్వాలి

-డైమండ్‌బాబు, డెప్యూటీ మేయర్



అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన నేపథ్యంలో అనేక చోట్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో శిలఫలాకాలు ఏర్పాటు చేశాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిపై దృష్టి పెట్టింది. ధ్వంసం చేయడం దారుణం. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా అధికారుల తగిన చర్యలు తీసుకోవాలి. సిబ్బంది తగిన గైడ్ లైన్స్ ఇచ్చి చర్యలు చేపట్టాలి.

బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: కాలానుగుణంగా ఉపాధ్యాయులు బోధన పటిమను అభివృద్ధి పరచుకోవాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఉర్దూ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించారు. ఈసందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుని విద్యాబోధనలో వాటిని ఉపయోగించాలని సూచించారు. ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయులు డిజిటల్ విద్యాబోధనపై అవగాహన పెంచుకుని, విద్యార్థులందరికీ అర్థమయ్యే విధంగా వినూత్న తరహాలో బోధన సాగించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దిక్, కార్యదర్శి షాజహాన్, సమగ్రశిక్ష ఏఎస్‌ఓ జయశంకర్, సీఆర్పీ కీర్తి పాల్గొన్నారు.

సంజీవయ్యనగర్ హైస్కూల్ ఎస్ఎంసీ కమిటీ ఎన్నిక

గుంటూరు ఎడ్యుకేషన్: సంజీవయ్యనగర్‌లోని పినపాటి ప్రభుదాస్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) కమిటీని ఎన్నుకున్నారు. గతంలో కోరం లేక వాయిదా పడిన ఎస్ఎంసీ ఎన్నికలను శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.ప్రమీల అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సభ్యులను ఎన్నుకున్న అనంతరం ఎస్ఎంసీ కమిటీ చైర్మన్‌గా బి.లక్ష్మి, వైస్ చైర్మన్‌గా ఎం.ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎస్ఎంసీ వివరాలను ఎంఈఓ కార్యాలయానికి పంపిన హెచ్ఎం ప్రమీల ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు.

ఖాతాదారుల ఉన్నతికి యూబీఐ కృషి

పెన్షన్‌దారుల ఆత్మీయ సదస్సులో యూబీఐ రీజినల్ హెడ్ జవహర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యూబీఐ రీజినల్ హెడ్ జవహర్ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): ఖాతాదారుల ఉన్నతికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) కృషి చేస్తోందని ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎస్.జవహర్ స్పష్టం చేశారు. స్థానిక జీటీ రోడ్‌లోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం సీనియర్ సిటిజన్స్, పెన్షన్‌దారులకు ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖాతదారుల ప్రయోజనాలే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. యూబీఐ ఇప్పుడు సీనియర్ సిటిజన్స్, సూపర్ సీనియర్ సిటిజన్స్‌కు డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లు ఇస్తున్నట్లు తెలిపారు. 333 రోజుల డిపాజిట్ స్కీమ్‌లో యూబీఐ సీనియర్ సిటిజన్స్‌కు 7.90 శాతం వడ్డీ, సూపర్ సీనియర్ సిటిజన్స్‌కు 8.15 శాతం వడ్డీ చెల్లిస్తున్నట్టు వివరించారు. పెన్షనర్స్ యూబీఐకి తమ సహాయ సహకారాలు లందించాలని కోరారు. కొత్త మదుపుదారాలను బ్యాంక్ ఖాతాలు తెరిచేలా చూడాలని పెన్షనర్స్‌ను కోరారు. అంతేకాకుండా వారి బంధు మిత్రులు, వారి కుటుంబ సభ్యులకు యూబీఐకి సంబంధించిన లోన్స్, డిపాజిట్లు గానీ తీసుకునేలా ప్రోత్సహించి బ్యాంక్ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

దేశాన్ని ముందుకు నడిపించే నాయకులుగా ఎదగాలి

ఏసీబీ ఏఎస్పీ మహేంద్ర మత్తే



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు దేశాన్ని ముందుకు నడిపించే నాయకులుగా ఎదగాలని ఏసీబీ అదనపు ఎస్పీ మహేంద్ర మత్తే అన్నారు. అరండల్‌పేటలోని కెనడీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల మెరిట్ క్యాంపస్‌లో శనివారం విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎస్పీ మహేంద్ర మత్తే కేబినెట్ విద్యార్థులకు బ్యాడ్జీలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని, కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. కెనడీ విద్యాసంస్థల డైరెక్టర్ కె.శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్నికలను నిర్వహించి, స్కూల్ కేబినెట్ నాయకులుగా ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర కె.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ ఎస్. ఐజాక్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య పాల్గొన్నారు.

వ్యర్థాలను రోడ్లపై వేస్తే చర్యలు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



పారిశుద్ధ్యంపై సిబ్బందిని ఆరా తీస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలోని ప్రధాన మార్కెట్‌ల నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను రోడ్ల మీద వేయకూడదని, ప్రజారోగ్యం దృష్ట్యా రోడ్ల మీద వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం నందివెలుగు రోడ్డు విస్తరణ పనులు, బాలాజీ నగర్, కొల్లి శారద హోల్ సేల్ మార్కెట్, రైతు బజార్, ఆనంద పేట తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, పొన్నూరు రోడ్, ఏటుకూరు రోడ్‌లోని గార్బేజ్ డంపింగ్ పాయింట్స్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత కొల్లి శారద హోల్ సేల్ మార్కెట్, రైతు బజార్‌లను పరిశీలించి, అక్కడి వ్యాపారులతో మాట్లాడుతూ మార్కెట్‌ల నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్ల మీద వేయడం వలన, వాటిని తొలగించడంలో జాప్యం జరిగితే దుర్గంధం వచ్చి ప్రజారోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మార్కెట్‌ల నుంచి వచ్చే వ్యర్థాలను కమర్షియల్ వ్యర్థాల సేకరణ వాహనాల ద్వారా తొలగించాలన్నారు. వ్యాపారస్తులు వ్యర్థాల నిర్వహణకు సహకరించాలని, ఇష్టానుసారంగా రోడ్ల మీద వేస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. కొల్లి శారద హోల్ సేల్ మార్కెట్‌లో ఆశీలు వసూళ్ల టెండర్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నందివెలుగు రోడ్ విస్తరణలో భాగంగా నగరపాలక సంస్థ తరఫున చేపట్టాల్సిన పనుల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. అనంతరం పొన్నూరు రోడ్, ఏటుకూరు రోడ్‌లోని డంపింగ్ యార్డ్‌లను పరిశీలించి ప్రతి రోజు వస్తున్న వ్యర్థాల వివరాలు, జిందాల్‌కి పంపుతున్న వ్యర్థాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో డీఈఈ శ్రీధర్, శానిటరీ సూపర్ వైజర్ ఆయూబ్ ఖాన్, ఏఈ సునీల్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సలాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎం.ఐజాక్, ఏడుకొండలు పాల్గొన్నారు.

పోలీస్ తనిఖీల్లో 198 వాహనాలు సీజ్

నగరంపాలెం: నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎనిమిది ప్రదేశాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం ఒక గంటపాటు ఆయా ప్రదేశాల్లో వచ్చే, పోయే వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహన పత్రాలు, నంబర్ ప్లేట్లను, ముగ్గురు వెళ్లే వాహనాదారులను నిలిపివేశారు. పత్రాలు, నంబర్ ప్లేట్లను గుర్తించారు. ఈ క్రమంలో 198 వాహనాలను సీజ్ చేశారు. తనిఖీల్లో ఇద్దరు జిల్లా ఏఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, 16 మంది సీఐలు, 130 మంది పోలీస్ సిబ్బంది ఆయా బృందాల్లో పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు జూనియర్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ బి.ప్రసాద్, నగర సంఘటన్ కార్యదర్శి జి.సాయి కోరారు. శనివారం సాంబశివపేటలోని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ కార్యాలయంలో ఆర్ఐఓ జీకే జుబేర్‌ను ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గుంటూరు నగరంలోని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ఇంటర్మీడియేట్ బోర్డు నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా ఉదయం నుంచి రాత్రి వరకు ఏకదాటిగా తరగతులు నిర్వహిస్తూ, విద్యార్థులను మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు. క్యాంపస్‌లలోనే సొంతంగా ముద్రించిన పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను వేలాది రూపాయలకు విక్రయిస్తూ విద్య వ్యాపారం సాగిస్తున్నాయని ఆరోపించారు. సెలవు దినాల్లో యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నా, అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని, తక్షణమే కళాశాలల తనిఖీలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్ఐఓను కలిసిన వారిలో గోపి, సాయి, ఈశ్వర్, వంశీ, మధు, బాబ్జీ ఉన్నారు.

మార్చురీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



పట్నంబజారు: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది రోజులు గడుస్తున్నా మార్చురీలోనే ఉన్న పరిస్థితి నెలకొంది. తెలిసిన బంధువులు ఎవరైనా ఉంటే మృతదేహాన్ని గుర్తించాలని నగరంపాలెం పోలీసులు కోరారు. వివరాలు.. గతనెల 31న మస్తాన్‌దర్గా సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించిన స్థానికులు 108 ద్వారా గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివరాల కోసం 9963347223కు సమాచారం అందించాలని కోరారు.

వృద్ధుడి మృతదేహం..



పట్నంబజారు: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఈనెల 4న రాత్రి సుమారు 70 సంవత్సరాల వయస్సు ఉన్న వృద్ధుడు శంకర్‌విలాస్ ఓవర్‌బ్రిడ్జి కింద మృతిచెంది పడి ఉన్నాడు. సంబంధిత వృద్ధుడి ఆచూకి తెలియరాలేదు. మృతుడికి సంబంధించి ఎవరైనా బంధువులు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వివరాల కోసం 8688831332కు సమాచారం అందించాలని తెలిపారు.

జూడాల సమ్మెకు పెరుగుతున్న మద్దతు

గుంటూరు జీజీహెచ్‌లో ఆందోళన ఉధృతం

గుంటూరు మెడికల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడిని నిరసిస్తూ గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ వైద్యులు చేస్తున్న సమ్మె శనివారానికి ఐదో రోజుకు చేరింది. శుక్రవారం నుంచి అత్యవసర వైద్య సేవలు బహిష్కరించడంతో చికిత్స కోసం వచ్చే వైద్య సేవల్లో జాప్యం చోటుచేసుకుంటుంది. అత్యవసర వైద్య సేవలను బహిష్కరించడం, ప్రైవేటు ఆస్పత్రులు బంద్ పాటించడంతో శనివారం జీజీహెచ్‌కు వచ్చే ఓపీ రోగుల సంఖ్య కొంత మేరకు తగ్గుముఖం పట్టింది. శనివారం ఐఎంఏ నేతలు గుంటూరు జీజీహెచ్‌కు ర్యాలీగా వచ్చి జూడాలకు తమ మద్దతు తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌లోని నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ యూనియన్ నేతలు నల్లబ్యాడ్జిలు ధరించి జూడాలకు తమ మద్దతు ప్రకటించారు. పలు పార్టీల ప్రజాప్రతినిధులు, విద్యార్థి సంఘాల నేతలు జూడాలకు తమ మద్దతు ప్రకటించారు. దోషులకు శిక్ష పడే వరకు తమ పోరాటం కొనసాగుతోందని జూడా సంఘం నేతలు స్పష్టం చేశారు. తక్షణమే రక్షణ చట్టాలు అమలులోకి తీసుకు రావాలని కోరారు. వైద్యురాలి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని వివరించారు. నిరసన కార్యక్రమంలో జూనియర్ వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ దీక్షిత్, డాక్టర్ అన్వర్ బాషా, డాక్టర్ రవి, డాక్టర్ అశ్విని, డాక్టర్ భవిత పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

కొవ్వొత్తుల ర్యాలీ..

నెహ్రూనగర్: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి చర్యలు జరగకుండా కఠిన శిక్షలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మృతి చెందిన ట్రైనీ డాక్టర్‌కు సంఘీభావంగా దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌తో శనివారం రాత్రి పాత గుంటూరు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఉమామహేశ్వరరావు, భగత్ సింగ్, ఖాజావలి, సలీమా, రాంబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి..

లక్ష్మీపురం: కోల్‌కతాలో వైద్య విద్యార్థి డ్యూటీలో ఉన్న సమయంలో లైంగిక దాడికి పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు కొత్తపేట భగత్ సింగ్ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ మాట్లాడుతూ మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జంగాల చైతన్య, వలి, నగర కార్యదర్శి చల్లా మరియాదాసు, చల్లా పూర్ణ, చల్లా ఆకాష్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, ఏఐఎస్ఎఫ్ నగర్ కార్యదర్శి యశ్వంత్, నవ్యశ్రీ, దుర్గా సాయి అమర్నాథ్, డేవిడ్, కిరణ్ , వెంకటేష్, తేజ అజయ్ పాల్గొన్నారు.



ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల నిరసన

వైద్యురాలిపై లైంగిక దాడి దారుణం..

లక్ష్మీపురం: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన లైంగిక దాడి ఘటనను అవగాహన సంస్థ సభ్యులు ఖండించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సదాశివం, పి.ఎస్.మూర్తి పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: కుటుంబాల కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. దుర్గానగర్‌లో నివాసం ఉండే ఆనాల నాగేశ్వరరావు(63) సైకిల్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య పద్మతో గత కొంత కాలంగా విభేదించి వేర్వేరుగా ఉంటున్నారు. మూడు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యతో విభేదించి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.